కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ : సోమవారం, 10 జూన్ 2024
సంపుటి: 14, సంచిక: 66, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam



## మంత్రులకు మోదీ పాఠాలు

నిర్లక్ష్యం పనికిరాదని బాధ్యతలపై దృష్టి సారించాలని ఆదేశం

02

తెలంగాణ బిజెపి

## అధ్యక్షుడిగా ఈటల..?

బిజెపి కేంద్ర నాయకత్వం రాయబారం..!

02







# 72 మందితో...

# నమో భారత్

## ప్రపంచ ప్రజల సాక్షిగా ఆవిష్కృతమైన చారిత్రక ఘట్టం

కేబినెట్ మంత్రులుగా 30 మంది, సహాయ మంత్రులు (స్వతంత్ర హెూదా) ఐదుగురు, సహాయ మంత్రులుగా 36 మంది ప్రమాణం

కేంద్ర మంత్రుల్లో అగ్రవర్ణాలకు చెందిన 25మంది, ఓ బి సి నుంచి 27, ఎస్సీ 10, ఎస్టీ ఐదు మైనార్టీలు ఐదు మంది కేబినెట్ మంత్రులుగా ఉన్నారు

- భారత ప్రధానిగా నెహ్రూ రికార్డును సమం చేసిన నరేంద్ర మోడీ
- మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ
- మూడు సార్లు కేంద్ర మంత్రులుగా పనిచేసిన 43 మంది
- 39 మందికి రాష్ట్రాల్లో మంత్రులుగా పనిచేసిన అనుభవం
- విపక్షాలకు 11 మంత్రి పదవులు
- కేంద్ర మంత్రులుగా నలుగురు మాజీ ముఖ్యమంత్రులు



**న్యూఢిల్లీ జూన్9 (నిఘా న్యూస్):** చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. 3వ సారి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణం చేసి. నెహ్రూ రికార్డును సమం చేశారు. హ్యాట్రిక్ విజయాలతో ఎన్ డి ఏ కూటమిని అధికారం లోకి తీసుకువచ్చిన మోదీ. ముచ్చటగా 3వ సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. తరలి వచ్చిన విదేశీ మిగతా2లో..



## కేంద్రంలో తెలుగు మంత్రులు

- శ్రీకాకుళం నుండి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- సహాయ మంత్రిగా గుంటూరు ఎంపీ ఎమ్మసాని
- తెలంగాణ నుండి కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు మంత్రి పదవులు
- ఉత్తరాంధ్రకు మరోసారి ప్రాధాన్యత
- విస్తరణలో టిడిపికి మరో రెండు మంత్రి పదవులొచ్చే అవకాశం

02



## మోడీ ప్రభుత్వం... మున్నాళ్ల ముచ్చటనే

- అప్రజాస్వామికంగా కొలువు తీరుతున్న మోడీ ప్రభుత్వం
- త్వరలో అధికారంలోకి ఇండియా కూటమి
- 400 సీట్లు గెలుస్తామన్న బిజెపికి కనీస మెజారిటీ రాలేదు
- ప్రమాణ స్వీకారానికి విదేశీయులను తప్ప స్వదేశీయులను ఆహ్వానించలేదు
- ఎన్డీఏపై మమత సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా, జూన్ 9 (నిఘా న్యూస్):** పశ్చిమబెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో చట్టవిరుద్ధంగా, అప్రజాస్వామ్యంగా ప్రభుత్వం కొలువు దీరుతోందని ఆరోపించారు. అందుకే ప్రధాని మిగతా2లో..

## ముస్తాబౌతున్న... చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదిక

సీఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్ల కోసం ఐదుగురు ఐఏఎస్‌ల బృందం



**గన్నవరం జూన్ 9 (నిఘా న్యూస్):** కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదిక సిద్ధమవుతోంది. సభా వేదిక పనులు దగ్గరుండి అధికారులు, టీడీపీ నాయకులు పరివేక్షిస్తున్నారు. ఈనెల 12వ తేదీ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సభా వేదిక నిర్మాణం వద్ద టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక దళాలతో భారీ బందోబస్తు చేసేలా ప్రణాళిక ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను మిగతా2లో..



## అమరావతిలో చెత్తా చెదారం తొలగింపు

రాజధాని ప్రాంతంలో సీఎస్ పర్యటన

ఆగిన నిర్మాణ పనులపై ఆరా

**అమరావతి జూన్ 9 (నిఘా న్యూస్):** రాజధానిలో ఆగిపోయిన నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ పరిశీలించారు. ఉద్దండరాయుని పాలెంలో ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని, సీఆర్డీయే కార్యాలయాన్ని, ప్రజాప్రతినిధుల నివాసాలు, అఖిలభారత సర్వీసు అధికారుల క్వార్టర్స్ మిగతా2లో..

## వైరా రిజర్వాయర్‌కు సాగునీరు

ఎన్నికల కోడ్ కు ముందే 75 కోట్లు మంజూరు

సాగునీటి ప్రాజెక్టుల పనులపై భట్టి సమీక్ష



**మధిర జూన్ 9 (నిఘా న్యూస్):** ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పనులపై ఈ నెల 12న జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక,విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రజాప్రతినిధులు, అధికారుల సమీక్షా సమావేశంలో మిగతా2లో..

## బందీలను కాపాడేందుకు.. 274 మందిని బలిగొన్న ఇజ్రాయిల్



**గాజా జూన్9(నిఘా న్యూస్):** గాజాలో ఉద్ధృత పోరు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే సెంట్రల్ గాజాలోని రెండు వేర్వేరు ప్రదేశాల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి నలుగురు బందీలను కాపాడినట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రయత్నంలో టెల్అవీవ్ దళాలు జరిపిన దాడుల్లో స్థానికంగా భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 274 మంది పాలస్తీనీయన్ల ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య విభాగం వెల్లడించింది. మరో మిగతా2లో..



## ముగిసిన రామోజీ అంత్యక్రియలు


పాడే మోసిన చంద్రబాబు

**హైదరాబాద్ జూన్ 9 (నిఘా న్యూస్):** అక్షర యోధుడు, రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు అంత్యక్రియలు ముగిశాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పూర్తిచేశారు. గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని విశాలమైన మిగతా2లో..

## రైతులను దగా చేసిన కాంగ్రెస్

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి


కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు హితవు



**సిద్దిపేట జూన్ 9 (నిఘా న్యూస్):** వానా కాలం వచ్చినా రైతుల పంట పెట్టుబడి సాయం పై ప్రభుత్వం నోరు మెదపడం లేదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. పంట సాగు కంటే ముందే ఎకరాకు ఇస్తామన్న రూ. 7500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ మిగతా2లో..


## యాత్రికుల బస్సుపై ఉగ్రవాద దాడి..

10 మంది మృతి..



**శ్రీనగర్, జూన్9 (నిఘా న్యూస్):** జమ్మూ కాశ్మీర్‌లో టెర్రరిస్టులు బరితెగించారు. ఆదివారం రియాసి జిల్లాలో యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. బస్సు శివఖోడా ఆలయం నుంచి కత్రాకు మిగతా2లో..

# 72 మందితో... నమో భారత్





(మొదటిపేజీ తరువాయి)
అతిథులు, వీవీఐపీలు, సెలబ్రిటీలు, వేలాది మంది ప్రజల సమక్షంలో రాష్ట్రపతి భవన్‌లో కన్నులపండువగా ఈ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలుత నరేంద్ర మోదీతో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాని మోదీ ప్రమాణం అనంతరం ద్రౌపది ముర్ము కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్నారు. ప్రధాని ప్రమాణం తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా తో ప్రమాణం చేయించారు.

**72 మంది మంత్రులతో కొలువుదీరిన మోదీ 3.0 సర్కార్**

ఈసారి మోదీ కేబినెట్‌లో 72 మంది ఉన్నారు. వీరిలో కేబినెట్ ర్యాంక్ 30 మంది ఉంటే, సహాయ మంత్రులు (స్వతంత్ర హోదా) ఐదుగురు, సహాయ మంత్రులుగా 36 మంది ప్రమాణం చేశారు. మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన వారిలో 43 మందికి 3 సార్లు కేంద్ర మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉంది. 39 మందికి రాష్ట్రాల్లో మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉంది.

**విపక్షాలకు 11 మంత్రి పదవులు**

మోదీ 3.0 కేబినెట్ లో భారత్ నలుమూలల నుంచి. 24 రాష్ట్రాలు. అన్ని ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకున్నారు. మొత్తంగా మిత్రపక్షాలకు 11 కేంద్ర మంత్రి పదవులు దక్కాయి.

**నలుగురు మాజీ సీఎంలు**

ఈసారి మోదీ 3.0 కేబినెట్‌లో మరో విశేషం ఉంది. నలుగురు ముఖ్యమంత్రులు ఈసారి కేంద్ర కేబినెట్‌లో ఉన్నారు. గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్, హర్యానా మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, కర్నాటక మాజీ సీఎం కుమారస్వామి, బీహార్ మాజీ సీఎం జితిన్ రామ్ మాంఝీ ఇప్పుడు కేంద్రంలో కీలక పాత్ర పోషించబోతున్నారు. మోదీ 3.0 కేబినెట్ లో 34 మంది రాష్ట్ర శాసనసభలలో పనిచేసిన వారు, 23 మంది రాష్ట్రాలలో మంత్రులుగా పనిచేసిన వారు సైతం ఉన్నారు. కేబినెట్ మంత్రుల్లో అగ్రవర్ణాలకు చెందిన వారు 25మంది ఉన్నారు. ఓ బి సి నుంచి 27, ఎస్సీ 10, ఎస్టీ 5, మైనార్టీలు 5 మంది కేబినెట్ మంత్రులుగా ఉన్నారు.

కేబినెట్‌లో ఎవరికి ఏ శాఖ కేటాయిస్తారు. గతంలో ఉన్న మంత్రులకు తిరిగి అవే శాఖలు అప్పగిస్తారా, ఈసారి బాధ్యతలు మారతాయా అనేది ఉత్కంఠ రేపుతోంది. ఈ వేడుకకు తెలుగుదేశం అధినేత, ఏపీ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సహా మిత్రపక్షాల అగ్రనేతలంతా హాజరయ్యారు. ఈసారి మిత్రపక్షమైన జనసేనకు చోటు కల్పించలేదు. త్వరలోనే విస్తరణలో పదవి ఇచ్చే అవకాశం ఉంది.

**ప్రమాణస్వీకారోత్సవంలో ప్రముఖుల సందడి**

భారత ప్రధానిగా వరుసగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారోత్సవంలో ప్రముఖులు సందడి చేశారు. రాష్ట్రపతి భవన్ వద్ద వైభవంగా జరుగుతున్న ఈ వేడుకకు సార్క్ సభ్యదేశాల ప్రతినిధులు, ఎన్డీఏ భాగస్వామ్యపక్షాల అధినేతలతో పాటు దేశ నలుమూలల నుంచి పలువురు రాజకీయ, సినీ, వ్యాపార దిగ్గజాలు తరలివచ్చారు. మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి విచ్చేసిన విదేశీ ప్రముఖుల్లో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జు, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె, నేపాల్ ప్రధాని ప్రచండ, మారిసస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్, బూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే సహా పలువురు నేతలు ప్రత్యేక అతిథులు విచ్చేశారు. ఈ వేడుకకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం హాజరయ్యారు.

ఈ వేడుకలో ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కడ్, సుప్రీంకోర్టు సీజే జస్టిస్ డీవై చంద్రచూడ్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెదేపా అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఎన్సీపీ నేత అజిత్ పవార్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, సినీనటులు షారుక్ ఖాన్, రజనీకాంత్‌తో పాటు భాజపా సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీ, కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ, ఆధ్యాత్మికవేత్త చినజీయర్ స్వామి, పలు పీఠాలకు చెందిన అధిపతులు తరలివచ్చారు.



## ముగిసిన రామోజీ అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)
ప్రాంతంలో ఆయన నిర్మాణం చేయించుకున్న ఆ స్మృతి కట్టడం వద్దే అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. రామోజీరావు చితికి కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్ నిప్పంటించారు. రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది, అభిమానుల 'జోహార్ రామోజీరావు' నినాదాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. అంత్యక్రియల్లో తెదేపా అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్కతో పాటు భాజపా ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తదితరులు హాజరయ్యారు. ఏపీ నుంచి కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చింతమనేని ప్రభాకర్, రఘు రామకృష్ణరాజు, అరిమిల్లి రాధాకృష్ణ, వెనిగండ్ల రాము, పలువురు తెదేపా నేతలు పాల్గొన్నారు.

**రామోజీరావు పాడె మోసిన తెదేపా అధినేత చంద్రబాబు**

రామోజీ గ్రూపు సంస్థల కార్యాలయాల మీదుగా స్మారక కట్టడానికి చేరింది. అంత్యక్రియలకు తెదేపా అధినేత చంద్రబాబు హాజరయ్యారు. స్మృతి వనం వద్ద నివాళులర్పించిన అనంతరం రామోజీరావు పాడె మోశారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, సినీ ప్రముఖులు, రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రైతులను దగా చేసిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)
చేశారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్‌పామ్ ఆయిల్‌పామ్ తొలి పంటను ఆదివారం నాడు రైతులు తీశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలోరైతు నాగేందర్ కోరిక మేరకు మొదటి పంటను మాజీ మంత్రి హరీశ్‌రావు కోశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ క్రాప్ మెయింటెనెన్స్ కింద ప్రభుత్వం రైతుకు ఏడాదికి రూ.4200 ఇవ్వాలన్నారు.

ప్రభుత్వ సహకారం లేకపోవడంతో పామాయిల్ పంటపై రైతులు ఆసక్తి చూపించడం లేదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రైతు భరోసా నిధులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పచ్చిరొట్ట, జీలుగ, జనుము విత్తనాల సరఫరా చేయని దుస్థితి ఈ రాష్ట్ర ప్రభుత్వానిది అని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇవ్వాల్సిన నిదులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని దగా చేయడం మంచిది కాదని హితవు పలికారు.

## వైరా రిజర్వాయర్‌కు సాగునీరు

(మొదటిపేజీ తరువాయి)
ఆయన మాట్లా డారు. నీళ్లు, నియామకాల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన గత పాలకులు జిల్లాలో ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న సీతారామ సాగునీటి ప్రాజెక్టు, వైరా రిజర్వాయర్ కు సాగర్ కాలువ అనుసంధానం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని జోన్ 3 ద్వారా మధిర,సత్తుపల్లి నియోజక వర్గాలకు సాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష ఉంటుందన్నా రు.సాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్ కు సాగునీటిని మళ్లించేందుకు ఎన్నికల కోడ్ కు ముందే రూ.75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు గుర్తు చేశారు. ఈ పనులపై కూడా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఖమ్మంలో సమీక్ష చేపట్టిన మరుసటి రోజే ఈ నెల 13న సాగునీటి ప్రాజెక్టుల పనులు వాటి ప్రగతిని తెలుసుకునేందుకు జిల్లాలో తనతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి క్షేత్ర పర్యటన చేపడుతామని అన్నారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏన్కూర్ నుంచి వైరా రిజర్వాయర్ కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం, కల్లూరు మీదుగా మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు జోన్ 3 ద్వారా కృష్ణా జలాలను అందించడం వంటి పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులతో సమీక్షిస్తామని పేర్కొన్నారు.

## అమరావతిలో చెత్తా చెదారం తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)
హైకోర్టు, నాలుగోతరగతి సిబ్బంది నివాసాలను పరిశీలించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసేలోపు రాజధానిలో పరిశుభ్రత పనులు పూర్తి చేస్తామన్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు 94 జేసీబీలతో 34 ప్రాంతాల్లో పనులు కొనసాగిస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా ఎలాంటి పనులు చేయని భవనాల నాణ్యతపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏపీ బెవరేజెస్, మైనింగ్, సీఐడీ కార్యాలయాలను జప్తు చేసి వాటిలో కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎస్ చెప్పారు. సీఎస్‌తో పాటు సీఆర్డీయే కమిషనర్ వివేక్ యాదవ్ తదితరులు రాజధాని ప్రాంతంలో పర్యటించారు.

## యాత్రికుల బస్సుపై ఉగ్రవాద దాడి..

(మొదటిపేజీ తరువాయి)



తిరిగి వస్తుండగా ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు.దాడి జరిగిన వెంటనే పోలీసులు, సైన్యం, పారామిలటరీ బలగాలు ఘటనాస్థలికి చేరుకున్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో బస్సు ఒక్కసారిగా లోయలో పడిపోయింది. అందులో ప్రమాణిస్తున్న ప్రయాణికుల్లో 10 మంది మరణించగా, 33 మంది గాయపడ్డారు. కాల్పుల కారణంగా డ్రైవర్ బస్సుపై కంట్రోల్ కోల్పోవడంతో బస్సు లోయలో పడిందని రియాసీ ఎస్పీ మోహిత శర్మ తెలిపారు. పొరుగున ఉన్న పూంచ్, రాజౌరిలతో పోలిస్తే రియాసీ జిల్లాలో ఉగ్రవాదుల కార్యకలాపాలు చాలా తక్కువ, అయినప్పటికీ ఈ దాడి జరిగింది. ప్రయాణికుల గుర్తింపు ఇంకా ధ్రువీకరించలేదు. మరణించిన వారు స్థానికులు కాదని తెలుస్తోంది. భద్రతా బలగాలు ఘటన స్థలంలో దర్యాప్తు ప్రారంభించాయి. ఈ ఘటనపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఈ దాడిని ఆయన ఖండించారు. ఉద్దేశపూర్వకంగా మన జాతీయ భద్రతకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై బీజేపీ ప్రభుత్వానిది అసత్యప్రచారమే అని, ప్రస్తుతం మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం బోలుగా ఉందని విమర్శించారు.

# మంత్రులకు మోదీ పాఠాలు

**నిర్లక్ష్యం పనికిరాదని బాధ్యతలపై దృష్టి సారించాలని ఆదేశం**



**న్యూఢిల్లీ జూన్ 9 (నిఘా న్యూస్):** ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారానికి అంతా సిద్ధమైంది. ఈ నేపథ్యంలో భాజపా నుంచి కాబోయే మంత్రులకు తేనేటి విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. దేశ అభివృద్ధి కోసం ఈ భేటీలో నేతలకు మోదీ కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణమే బాధ్యతలపై దృష్టి సారించాలని దేశ అభివృద్ధి కోసం చేపట్టిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేలా పనిచేయాలని మోదీ దిశానిర్దేశం చేశారు. మరికొన్ని గంటల్లో ప్రారంభం కానున్న ప్రమాణ స్వీకారంలో మోదీతో పాటు కొందరు కేంద్రమంత్రులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సారి ఇద్దరు మాజీ సీఎంలకు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కినట్లు సమాచారం. వీరిలో హరియానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నారు.

# మోడీ ప్రభుత్వం... మున్నాళ్ల ముచ్చటనే

(మొదటిపేజీ తరువాయి)



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో టీఎంసీ పాల్గొనటం లేదన్నారు. 400 సీట్లు గెలుస్తామన్న వారు కనీస మెజార్టీ మార్క్ కూడా సాధించుకోలేకపోయిందని ధ్వజమెత్తారు. కొన్ని రోజులకు ఇండియా కూటమి ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని సార్లు ప్రభుత్వాలు ఒకరోజు మాత్రమే ఉంటాయని ఏదైనా జరిగితే ఎన్డీయే కూటమి ప్రభుత్వం కేవలం 15 రోజులు మాత్రమే ఉండొచ్చని మమత జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు.

తాజా ఫలితాల్లో ఇండియా కూటమి 232 స్థానాల్లో విజయం సాధించింది. ఇక టీఎంసీ బెంగాల్‌లో 29 స్థానాల్లో గెలుపొందింది. అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన నాలుగో పార్టీగా టీఎంసీ నిలిచింది. ఆదివారం ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్న క్రమంలో ఇండియా కూటమిలో బలమైన నేతగా ఉన్న సీఎం మమత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలా ఉంటే ఆదివారం జరగనున్న మోదీ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఇండియా కూటమి నుంచి ఎవర్నీ ఆహ్వానించలేదని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ తెలిపారు. స్వదేశీయులను పక్కన పెట్టి విదేశీయులను ఆహ్వానించారని ఎద్దేవా చేశారు.

# బందీలను కాపాడేందుకు.. 274 మందిని బలిగొన్న ఇజ్రాయిల్

(మొదటిపేజీ తరువాయి)



సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఇతర ఐఏఎస్ లు పర్యవేక్షిస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలో కేసరపల్లి వద్ద గల ఐటీ పార్క్, మేధా టవర్స్ నేషనల్ హైవే పక్కన ఉన్న పొట్లూరి బసవరావు స్థలంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్రబాబు మంత్రులతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సహా పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ప్రమాణ స్వీకారం ఏర్పాట్లపై విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రమాణ స్వీకార సభకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అతిథులుగా వచ్చిన వారికి, సభాస్థలికి విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. సీఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్ల కోసం ఐదుగురు ఐఏఎస్‌ల బృందాన్ని సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) నియమించింది. బృందంలో సభ్యులుగా ఐఏఎస్ అధికారులు బాబు.ఏ, హరి జవహర్ లాల్, కన్నబాబు, సీహెచ్ హరికిరణ్, వీర పాండియన్‌లు ఉన్నారు. తదుపరి ఆదేశాల కోసం జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఎదుట ఐదుగురు ఐఏఎస్‌లు హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## కేంద్రంలో తెలుగు మంత్రులు

**శ్రీకాకుళం, జూన్9 (నిఘా న్యూస్):** కేంద్ర మంత్రివర్గంలో ఇద్దరు తెదేపా ఎంపీలకు స్థానం లభించింది.శ్రీకాకుళం నుంచి వరుసగా మూడోసారి ఎంపీగా గెలిచిన కింజరాపు రామ్మోహన్ నాయుడికి క్యాబినెట్ మంత్రి పదవి దక్కింది. అదేవిధంగా తెలంగాణ నుండి కిషన్ రెడ్డి బండి సంజయ్ లకు ప్రాతినిధ్యం కల్పించారు.గుంటూరు ఎంపీగా తొలిసారి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ రెడ్డికి సహాయ మంత్రి పదవి వరించింది.

ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు వీరిద్దరు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసారు.16 ఎంపీ స్థానాలు గెలిచిన టీడీపీ ఎన్డీయే కూటమిలో బీజేపీ తర్వాత రెండో అతిపెద్ద పార్టీ.ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణలో టీడీపీకి మరో రెండు మంత్రి పదవులు దక్కనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మంత్రి పదవులు దక్కించుకున్న రామ్మోహన్ నాయుడు, చంద్రశేఖర్‌లకు తెదేపా అధినేత చంద్రబాబు ఫోన్ జన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి,దివంగత ఎర్రన్నాయుడి కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన రామ్మోహన్‌నాయుడు వరుసగా మూడోసారి శ్రీకాకుళం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు.గత ఎన్నికల్లో రాష్ట్రమంతా వైసీపీ గాలి వీచినా తట్టుకుని నిలబడి, ఎంపీగా గెలిచారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన ఎర్రన్నాయుడి కుమారుడిగా,ఉత్తరాంధ్ర నుంచి వరుసగా గెలుస్తున్న యువనేతగా,పార్లమెంటరీ వ్యవహారాల్లో అనుభవమున్న నాయకుడిగా రామ్మోహన్‌నాయుడికి మంత్రి పదవి దక్కుతుందని అందరూ ఊహించిందే.తెలుగు,హిందీ, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యంతో పార్లమెంట్ చర్చల్లో ఆయన ఇప్పటికే ముద్ర వేసుకున్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని చంద్రబాబు నాయుడు రామ్మోహన్‌నాయుడికి కేంద్ర క్యాబినెట్ బెర్తు ఖరారు చేశారు.

**ఉత్తరాంధ్రకు మరోసారి వరమాల**

సంకీర్ణ ప్రభుత్వాల్లో భాగస్వామిగా తెదేపాకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం వచ్చినప్పుడల్లా ఉత్తరాంధ్రకు చోటిచ్చి చంద్రబాబు ఈ ప్రాంతం తమకెంత కీలకమో చాటిచెబుతున్నారు.1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో తెదేపా చేరడంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి,ఉపాధి కల్పన శాఖ మంత్రిగా కింజరాపు ఎర్రన్నాయుడికి అవకాశం ఇచ్చారు.2014లో ఎన్డీయే సర్కారులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా అశోక్‌గజపతి రాజును ఎంపిక చేశారు.ఇప్పుడు రామ్మోహన్‌నాయుడికి అవకాశం ఇవ్వడం ద్వారా ఉత్తరాంధ్రపై తెదేపాకున్న మక్కువను మరోసారి ప్రకటించినట్లయింది.

**పెమ్మసానికి తొలిసారే అదృష్టం**

ఈ ఎన్నికల ముందే క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు నుంచి టీడీపీ ఎంపీగా భారీ మెజారిటీతో గెలిచారు.గుంటూరు జిల్లా బుర్రిపాలెం నుంచి సాధారణ వైద్యుడిగా అమెరికా వెళ్లిన ఆయన అనతికాలంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు.

## తెలంగాణ బిజెపి అధ్యక్షుడిగా ఈటల..?

**బిజెపి కేంద్ర నాయకత్వం రాయబారం..!**



**న్యూఢిల్లీ జూన్ 9 (నిఘా న్యూస్):** బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఈటల రాజేందర్ ను నియమించాలని అధిష్టానం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది ఆదివారం ఈటల రాజేందర్ తో ఫోన్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడారు. అధిష్టానం దూతగా అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వాస శర్మ,ఈటెల రాజేందర్ తో చర్చలు జరిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి బాగా పుంజుకుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు ఇదే ఊపును కొనసాగించాలని శర్మ సూచించారు. తెలంగాణలో అధికారం లోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని, ఇందుకోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే బాధ్యత స్వీకరించాలని కోరినట్లు తెలిసింది. దీనికి ఈటల రాజేందర్ కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈటల రాజేందర్ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో భేటీ కానున్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో చర్చించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# ముస్తాబౌతున్న... చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదిక

**సీఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్ల కోసం ఐదుగురు ఐఏఎస్‌ల బృందం**



**గన్నవరం జూన్ 9 (నిఘా న్యూస్):** కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదిక సిద్ధమవుతోంది. సభా వేదిక పనులు దగ్గరుండి అధికారులు, టీడీపీ నాయకులు పరివేక్షిస్తున్నారు. ఈనెల 12వ తేదీ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సభా వేదిక నిర్మాణం వద్ద టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక దళాలతో భారీ బందోబస్తు చేసేలా ప్రణాళిక ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లను సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఇతర ఐఏఎస్ లు పర్యవేక్షిస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలో కేసరపల్లి వద్ద గల ఐటీ పార్క్, మేధా టవర్స్ నేషనల్ హైవే పక్కన ఉన్న పొట్లూరి బసవరావు స్థలంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్రబాబు మంత్రులతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సహా పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ప్రమాణ స్వీకారం ఏర్పాట్లపై విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రమాణ స్వీకార సభకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అతిథులుగా వచ్చిన వారికి, సభాస్థలికి విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు.

సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. సీఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్ల కోసం ఐదుగురు ఐఏఎస్‌ల బృందాన్ని సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) నియమించింది. బృందంలో సభ్యులుగా ఐఏఎస్ అధికారులు బాబు.ఏ, హరి జవహర్ లాల్, కన్నబాబు, సీహెచ్ హరికిరణ్, వీర పాండియన్‌లు ఉన్నారు. తదుపరి ఆదేశాల కోసం జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఎదుట ఐదుగురు ఐఏఎస్‌లు హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## స్వరూప్ నగర్ లో కార్పొరేటర్ పర్యటన



**ఉప్పల్, జూన్ 9 (నిఘా న్యూస్):** ఉప్పల్ డివిజన్ లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ రజిత రెడ్డి దంపతులు ఆదివారం విస్తృతంగా పర్యటించారు. డ్రైనేజీ ,సీసీ రోడ్డు మంచినీటి సమస్యల గురుంచి కాలనీ వాసులు కార్పొరేటర్ రజిత రెడ్డికి వివరించారు. సకాలంలో మంచినీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు సాయ శక్తులా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద ప్రభు కృష్ణమాచారి పిసాటి అంజి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జ్ఞానేశ్వర్ నాగేందర్ హనుమంత్, సల్ల ప్రభాకర్ రెడ్డి సుంకు శేఖర్ రెడ్డి లక్ష్మణ్ అంజయ్య గౌడ్ శ్రీనివాస్ రెడ్డి మల్లారెడ్డి అంకిరెడ్డి విపల్లవ్ రెడ్డి, యది రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు బియ్యం వితరణ



**ముస్తాబాద్, జూన్ 9 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బొబ్బిలి బాలనర్సు అలాగే ఈర్ల సరిత కుటుంబ సభ్యులను భారతీయ జనతా పార్టీ గ్రామశాఖ నాయకులు పరామర్శించారు. నిరుపేద కుటుంబాలు కావడంతో వారికి తమవంతు సహాయంగా బిజెపి నాయకులు 50 కిలోల బియ్యం చొప్పున రెండు కుటుంబాలకు బియ్యంవితరణచేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కోల కృష్ణగౌడ్,చీకోటి మహేష్, నాంపల్లి కనుకయ్య మామిండ్ల బిక్షపతి,లింగంపల్లి వెంకటేష్, అన్నవేని రంజీత్,బొల్లు వినయ్,మధు,
నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో పోచమ్మ బోనాలు

### యాదవ సంఘం ఆధ్వర్యంలో

### గ్రామ దేవతలకు మొక్కులు



**ముస్తాబాద్, జూన్ 9 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలతో, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. డప్పు చప్పులతో కోలాహాలంగా, ఆటపాటలతో మహిళలు బోనాలు అమ్మ వారికి సమర్పించారు.

## చండమ్మ తల్లికి బూరగాం గ్రామస్థుల మొక్కులు



**టెక్కలి, జూన్ 9 (నిఘా న్యూస్):** శ్రీకాకుళం ఎంపిగా కె.రామ్మోహన్ నాయుడు ఎమ్మెల్యేగా కె.అచ్చెన్నాయుడు అఖండ విజయం సాధించడంతో టెక్కలి మండలం బూరగాం గ్రామస్థులు మొక్కులు తీర్చుకొని విజయోత్సవాలు జరుపుకున్నారు.ఆదివారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం బూరగాం గ్రామపంచాయతీ రామేశ్వరం, బూరగాం తెలుగుదేశం పార్టీ నాయకులు 2024 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మరియు టెక్కలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కింజరాపు అచ్చం నాయుడు, పార్లమెంట్ సభ్యులుగా రామ్మోహన్ నాయుడు అత్యధిక మెజారిటీతో విజయ దుందుభి మోగించారు.నిత్యం ప్రజల మధ్య అంటూ ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజా మన్ననలు పొందిన బాబాయ్,అబ్బాయి గెలుపు ప్రజా విజయంగా అభివర్ణించారు.లఖీదాసుపురం సమీపంలో గల చండమ్మ తల్లి అమ్మవారి ఆలయం ఆవరణలో మేకపోతులతో మొక్కులు చెల్లించారు. యువ నేత రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా సంతబొమ్మాలి మండల మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్ ఆధ్వర్యంలో మేకపోతులతో చండమ్మ తల్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా శాంతమ్మ



**గోల్నాక, జూన్ 9 (నిఘా న్యూస్):** అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీ శ్రీకాంత్ గౌడ్ ప్రకటించారు. డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా శాంతమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఫాతిమా, కార్యదర్శిగా మానసలు నియమితులయ్యారు. ఈ మేరకు ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసి, వారికి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గోల్నాక డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ పోతునేని రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటాను: ఎమ్మెల్యే సబిత




## మీర్పేట్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**బాలాపూర్, జూన్ 9 (నిఘా న్యూస్):** ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఆర్యవైశ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లెల గూడాలోని ఎస్ వై ఆర్ గార్డెన్ లో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన మంచన ప్రేమ్ కుమార్ గుప్తా, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘాలు తమ సామాజిక వర్గంలో వెనుకబడ్డ వారికి, ఉన్నత విద్య అభ్యసించడానికి, మంచి ర్యాంకులు సాధించిన వారికి ప్రోత్సాహకరంగా స్కాలర్ షిప్ లు ఇవ్వడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వ పరంగా ఏ సహాయం కావాలన్న సహకరిస్తామని అన్నారు. అంతకుముందు నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఉప్పల రవీందర్ గుప్తా, కోశాధికారి శ్యాం ప్రసాద్ గుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మంచన శుభకుమార్ గుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శి వి నాగశంకర్ గుప్తా, అదనపు కోశాధికారిగా పబ్బా రాజు గుప్తా, పీఆర్వో కొక్కొండ లక్ష్మణ్ గుప్తా, మీడియా కన్వీనర్ గా అన్నారం సురేష్ గుప్తా లతో పాటు సలహాదారులు, ఉపాధ్యక్షులు సంఘం అభ్యున్నతికి పాటు పడుతామని వాసవీ మాత సాక్షిగా ప్రమాణం చేశారు. నూతన అధ్యక్షుడు మంచన ప్రేమ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వాలు పెంచుతామని, మహాసభ నియమ నిభందనల మేరకు సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎస్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా, రాజకీయ కమిటీ ఛైర్మన్ చింతల రవికుమార్, కార్యదర్శి అర్థం లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా, జిల్లా మహాసభ కోశాధికారి బిల్లకంటి కిరణ్ గుప్తా, బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాళ్ల శ్రీనివాస్ గుప్తా, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు కామేష్ రెడ్డి, దీప్ లాల్ చౌహాన్, వాసవీ కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ ఛైర్మన్ తెరిట్పల్లీ శ్రీనివాస్ గుప్తా, అధ్యక్షులు పచ్చిపులుసు శ్రీరామచంద్ర మూర్తి, ప్రధాన కార్యదర్శి ఇరువెంటి సురేష్ గుప్తా, కోశాధికారి గందే వెంకటేశ్వర్లు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# పైరవీలకు తావులేని పాలన అందిస్తాం





- అర్హులైన వారికే పెన్షన్,అక్రమ పద్ధతిలో పొందిన వాటిని రద్దు ఖాయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**పాలేరు, జూన్ 9 (నిఘా న్యూస్):** ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి పైరవీలకు తావులేదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అక్రమ పద్ధతిలో పెన్షన్ పొందిన వాటిని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన వారికే పెన్షన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తిరుమలాయపాలెం మండల పర్యటనలో భాగంగా తిరుమలయపాలెం, రమణ తండా, బీసరాజుపల్లి వెదుళ్ళచెర్వు పిండిప్రోలు, తెట్టలపాడు కేశవాపురం, తిప్పారెడ్డి గూడెం, అజ్మీరా తండా జల్లెపల్లి, జోగులపాడు హైదర్ సాయిపేట పడమటి తండా పాతర్లపాడు, గోల్ తండా, చంద్రు తండా ఇస్లావత్ తండా మహ్మదాపురం కుక్కల తండా మేకల తండా దమ్మాయిగూడెం తదితర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కష్ట ఫలితంగానే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇళ్ళ స్థలం,ఇళ్ళు ఇచ్చే బాధ్యత తనదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అనర్హులు పైరవీలు చేసి పెన్షన్ తీసుకుంటే విచారణ చేపట్టి వాటన్నింటినీ ఆపేస్తామని తెలిపారు. అర్హులైన పేదలకు పెన్షన్ ఇవ్వాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సభలు పెట్టి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కానీ భూమి సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఇళ్ళ పై నుంచి వెళ్లిన హై టెన్షన్ విద్యుత్ లైన్లను రెండు నెలల్లో మార్పిస్తామని చెప్పారు. వర్షాకాలం సాగుకు చివరి భూముల వరకు నీళ్లు వచ్చే విధంగా అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మంత్రితో పాటు ఎంపీపీ, వైస్ ఎంపీపీ జడ్పిటిసిలు ఎంపిటిసిలు సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కీసర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కీసర, జూన్ 9 (నిఘా న్యూస్):** ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర ఎంతో కీలకం. ఆట పాటలు,చిల్లర పనులు కష్టం సుఖం ఇలా ఏదైనా కాని అన్నింట్లో మన వెన్నంటే ఉండి సపోర్ట్ చేసేది ఒక స్నేహితులు మాత్రమే. అందరి కన్నా మన జీవితంలో చెరగని ముద్ర వేసేది పదవ తరగతి వరకు చదువుకున్న స్నేహితులు మాత్రమే. ఆనాటి జ్ఞాపకాలు ఎన్నటికి మరచిపోనివి, మరుపు రానివి అదే 1998-99 సంవత్సరాలు పదవ తరగతి చదివినవిద్యార్థిని,విద్యార్థులతోఆత్మీయసమ్మేళనంసంభ్రంగా నిర్వహించు కోవడం ఒక మధురాతి మధురం. వివరాల్లోకి వెళితే కీసర మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థినీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నల్ల వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసు కోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు దాదాపు 25 సంవత్సరాల తర్వాత కలుసు కోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదవిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్దులు నేర్పినగురువులను సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థిని, విద్యార్థులు అందరూ కలిసి ఉపాధ్యాయులను గౌరవించారు. ఈ కార్యక్రమంలో శేషయ్య భద్రారెడ్డి, ప్రతాప్ రెడ్డి లక్ష్మయ్యలు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల తరువాత తమను పిలించి ఇంతటి తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం, ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాబోధన అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఇదే విధంగా గత 25 సంవత్సరాలుగా చదువుకున్న విద్యార్థులందరికీ తమవంతుగా గురువులను గౌరవించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గురువులను శాలువాలు, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

# సిపిఐలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్లు

**కొత్తగూడెం, జూన్ 9 (నిఘా న్యూస్):** కొత్తగూడెం పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో 19,12 వార్డు మున్సిపల్ కౌన్సిలర్లు విజయలక్ష్మి,బండి నరసింహారావుతోపాటు మరో వంద కుటుంబాలు ఆదివారం కూనమనేని సమక్షంలో సీపీఐలో చేరారు.వీరికి కూనంనేని ఎర్రకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సిపిఐ పార్టీ అండదండగా ఉండి వారి సమస్యలను తీర్చడంలో ముందుంటుందని, సిపిఐ అనునిత్యం ప్రజల పక్షాన నిలబడుతుందని హామీచ్చారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ మొదటి నుండి కార్మిక, కర్షక వర్గాల సమస్యలు తీర్చడంలో ముందుంటుందని ఆయన అన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజలకోసం పనిచేసి ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. నియోజకవర్గంలో సీపీఐని తిరుగులేని శక్తిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శాసనసభ్యులు కూనమనేని మున్సిపల్ కౌన్సిలర్లు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్,



దుర్గారాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడు నగేష్, భూక్య శ్రీనివాస్ ఫేహీం వార్డు కౌన్సిలర్లు యూసుఫ్, మాచర్ల శ్రీనివాస్ యూసుఫ్, విజయ్, దుర్గ, నాయకులు లగడపాటి రమేష్, రమణమూర్తి, కిష్టఫర్, గోపికృష్ణ, ప్రభాకర్, ఎరకాల రామారావు, నేరేళ్ళ రమేష్, గుత్తులు శ్రీనివాస్ ముదేత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నను అభినందించిన చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ ఫోరమ్



**మేడిపల్లి, జూన్ 9 (నిఘా న్యూస్):** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా అఖండ విజయం సాధించిన తీన్మార్ మల్లన్న కు ఆదివారం చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు మహాదేవ్ ప్రసాద్ రాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువ తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహాదేవ్ ప్రసాద్ రాజు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న విజయం చాలా ఆనందాన్ని కల్గించిందన్నారు, జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను అదిగమించి తాను ఎంచుకున్న రంగానికి సంపూర్ణంగా న్యాయం చేస్తూ ప్రజల సమస్యలకు పరిష్కారం చేస్తున్న మహోన్నత వ్యక్తి తీన్మార్ మల్లన్న అని కొనియాడారు. రాబోయే రోజుల్లో తీన్మార్ మల్లన్న ఇంకా ఉన్నత పదవులు వరించాలని ఆకాక్షించారు.

## వైభవంగా రంగనాథుని కళ్యాణోత్సవం

### హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మౌలాలి, జూన్ 9 (నిఘా న్యూస్):** హెచ్.బి.కాలనీ కృష్ణా నగర్ కాలనీ శ్రీ రంగగిరి గోదాతాయారు రంగనాథ స్వామి దేవస్థానంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో 3 వ రోజు ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి లు నిత్య హవనం తర్వాత జరిగిన పూర్ణాహుతిలో పాల్గొన్నారు.తీర్థ ప్రసాద గోష్ఠి తర్వాత భాగవతోత్తములచే మహదాశీర్వచనం జరగింది. రంగగిరి ఆలయం ప్రకృతి ఒడిలో వొదిగినట్టు వుందని రంగగిరి సౌందర్యాన్ని చూస్తూ అలాగే కాసేపు వుండిపోయారు. ఉత్తరోత్తరా ఆలయ అభివృద్ధికి ఎలాంటి హాయ, సహకారాలు అవసరమైనా చేస్తానని హామీ ఇచ్చారు. ఎంతో బిజీ షెడ్యూల్ లో కూడా, ఆహ్వానించిందే తడవుగా ఆలయ సందర్శనకు విచ్చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి లకు ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందనలు తెలియజేసి సత్కరించారు. ఆదివారం సాయంత్రం రంగగిరిపై బ్రహ్మోత్సవాల లో భాగంగా రంగనాథుని తిరు కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, పూస రమేష్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన ఆంధ్ర నాట్యం



**ఉప్పల్, జూన్ 9 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నటరాజ నృత్యరామం గురువర్యులు పేరిణి శ్రీనివాస రావు శిష్య బృందం ఆంధ్రనాట్యం నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. అలరింపు వినాయక కౌతం గంగాధర, అగణిత నిన్ను మించిన, సరస్వతి, దశావతరాలు, తిల్లాన, నవగ్రహాలు, ప్రవేశదరువు, మొదలైన అంశాలను అక్షయ చర్య, నందిత, హారిక రెడ్డి, అద్వయ, చతుర్వి, మనస్విని, వర్ష, శ్రీనిధి, అదితి దాస్, శ్రీనిధి, సిరి రెడ్డి వరలక్ష్మి, సహస్ర,శ్రద్ధప్రతీకమొదలైనవారుప్రదర్శించి మెప్పించారు.

## అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఆవిష్కరణ



**నాచారం, జూన్ 9 (నిఘా న్యూస్):** మల్లాపూర్ ఎలిఫేంట్ సర్కిల్, లో కాప్రా సర్కిల్ అరుంధతి సంక్షేమ సంఘం అద్వర్యం లో ఎర్పాటు చేసిన విగ్రహ అవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొని విగ్రహాలను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లు మాట్లాడుతూ భారతదేశం ప్రజలు, భవిష్యత్తు తరాలకోసం రాజ్యాంగ నిర్మాతగా సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడిగా అంబేద్కర్ చేసిన కృషి, త్యాగం అజరామరం. వారి విగ్రహం ఏర్పాటు చేసుకోవడమంటే వారి అత్యున్నత ఆశయాలు భవిష్యత్ తరాలకు తెలియపర్చడమే. భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు,సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, ఆనాటి సమాజంలో చదువుకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్న పీడిత దళిత దీన జనుల కోసం శ్రమించిన సంస్కరణల యోధుడు అని తెలిపారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే కొనియాడారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్ బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్ రెడ్డి గొల్లురి అంజయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రామోజీరావుకు ఘన నివాళులు



**ఉప్పల్, జూన్ 9 (నిఘా న్యూస్):** ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావుకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత రెడ్డి, రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాభై ఏళ్ల క్రితం సైకిల్ పై తిరిగే సామాన్య వ్యక్తి పత్రికా రంగంలో ప్రవేశించి కొత్తపుంతలు తొక్కించారని అన్నారు. సామాన్య వ్యక్తి స్థాయి నుంచి ప్రపంచ మొత్తం గుర్తించుకునే వ్యక్తి వరకు చేరుకోవడం వెనుక ఆయన కష్టం ఎంతో ఉందన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన ప్రజా నాయకులకు ప్రజా అవసరాలను తెలియజేస్తూ ప్రజలకు సేవ చేసేందుకు అవసరమైన సూచనలు అం దించడంలో ఎప్పుడూ ముందుండే వారని ఆయన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిగా బండి నియామకం హర్షణీయం



**మేడ్చల్, జూన్ 9 (నిఘా న్యూస్):** దేశ చరిత్రలో కేంద్రంలో మూడోవ సారి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని బిజెపి మేడ్చల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్ అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ మూడోవ సారి ప్రధాని కావడం, కేంద్ర ప్రభుత్వ మత్రిత్వ శాఖలో బండి సంజయ్ కు చోటు కల్పించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. నిరుపేద కుటుంబం నుండి అతి సామాన్య కార్యకర్తగా ఎదిగి కార్పొరేటర్ నుండి ఎంపీ స్థాయికి వచ్చి ప్రతి సామాన్య ప్రజల గొంతుకై నిలిచే నాయకులు, సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రి గా బండి సంజయ్ ఎదగడం చాలా సంతోషం అన్నారు.

## వైద్య విద్యలో రాణించి ప్రజలకు సేవ చేయాలి

**టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు గుండ్రాతి మధు**



**వనపర్తి, జూన్ 9 (నిఘా న్యూస్):** వైద్య విద్యలో రాణించి పేద ప్రజలకు ఉన్నత వైద్య సేవలు అందించాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు గుండ్రాతి మధు గౌడ్, నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యులు మల్యాల బాలస్వామి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ లో ఉంటున్న మాధవరావు దంపతుల కూతురు ప్రణతి సిందేను టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా జర్నలిస్ట్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో జర్నలిస్టు పాత్ర పోషిస్తున్న మాధవరావు కూతురు ప్రణతి సిందే ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిజంలో ఉన్న ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ప్రణతి సిందే భవిష్యత్తులో వైద్యరంగంలో ఉన్నతంగా స్థిరపడి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, తల్లిదండ్రులకు, జిల్లా ప్రజలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు యాకూబ్, లక్ష్మణ్, మహమ్మద్ ఖలీల్, గంధం దినేష్, కుమార్, మల్లికార్జున్, శ్రీనాథ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ ను రక్షించండి



**విశాఖపట్నం, జూన్ 9 (నిఘా న్యూస్):** కేంద్రంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉప సంహరించు కోవాలని ఆ మేరకు ఎన్డీఏలో భాగస్వామ్యమైన టిడిపి ఒత్తిడి తేవాలని భేల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖలో జీవీఎంసీ గాంధీ బొమ్మ వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలో ఆయన పాల్గొన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణకు ఎంతకైనా పోరాడుతామని స్పష్టం చేశారు.

## రామోజీరావుకు శ్రద్ధాంజలి



**గోల్నాక, జూన్ 9 (నిఘా న్యూస్):** ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు ఆకాల మరణం పత్రికా రంగానికి తీరని లోటని గోల్నాక జైస్వాల్ గార్డెన్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, బిజెపి సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఆదివారంస్థానికసామాజికభవనంలోజరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్,కాలనీ వాసులు పాల్గొనిదివంగత రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతు తెలుగువారి కీర్తిని జాతీయస్థాయిలో చాటిన మహానీయుడు రామోజీరావు అని కొనియారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.మధుసూదన చారి, కోశాధికారి ఎం.అనిల్ చారి,ఉపాధ్యక్షుడుఎన్.స్వామిగౌడ్,కార్యదర్శులుకుందన సత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, సభ్యులు వెంకటరమణ, లక్ష్మీకాంత్ గౌడ్,విష్ణువర్ధన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# కామ్రేడ్ విజయలక్ష్మి సంస్మరణ సభ

**పామర్రు/మొవ్వ, జూన్ 9 (నిఘా న్యూస్):** కామ్రేడ్ విజయలక్ష్మి మృతి తీరనిలోటని మొవ్వ మండలం చినముత్తెవి పలువురు నేతలు అన్నారు. మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో రావూరి విజయలక్ష్మి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చేబ్రోలు బసవపూర్ణ అధ్యక్షత వహించారు. ఈ సభలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరావు మాట్లాడుతూ అజయ్ దంపతులు కమ్యూనిస్టు పార్టీ భావాలకు ఉద్యమాల కోసం పోరాటాల కోసం హార్దిక సహాయం, సహకారం మరువలేని వి.కమ్యూనిస్టు పోరాటాలకు విజయలక్ష్మి కుటుంబం ఇచ్చిన సహకారం మరువలేనిదని వక్తలు పేర్కొన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ మాజీ సంపాదకులు ఉషారాణి మాట్లాడుతూ విజయ్ నిలయం అన్ని ఉద్యమాలకు నిలయంగా ఉంది మేము గతంలో కూడా ఇక్కడ సాహితీ స్రవంతి కార్యక్రమాలను నిర్వహించి చాలా తృప్తి చెందామని విజయలక్ష్మి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి మొత్తం సాహితీ స్రవంతి సభ్యులు పాల్గొని సంతృప్తి చెందేలా జీవితం కొనసాగించారన్నారు. విజయలక్ష్మి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ రఘు అన్నారు. తన భర్త అజయ్ కుమార్ ఆశయాల కనుగుణంగానే విజయలక్ష్మి, ఆయన సిద్ధాంతాలతో ఏకీభవించి జీవితాన్ని గడిపిన వ్యక్తి అని పేర్కొన్నారు. మరణానంతరం అజయ్, విజయలక్ష్మి భౌతిక దేహాలను మెడికల్ కాలేజీకి పరిశోధన కోసం డొనేట్ చేయడం గర్వకారణంగా పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలకు సహాయం అందించాలని అన్నారు. విజయ్ అజయ్ సంస్మరణ సభలను ఒకేసారి నిర్వహించడానికి భవిష్యత్తులో కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ పరిసర ప్రాంతాలలో ప్రజల అభివృద్ధికి



కమ్యూనిస్టు పోరాటాలకి ప్రజాసేవలకు ఉపయోగపడేలా చినముత్తేవి సొంత గ్రామంలో భవనం నిర్మించి పార్టీకి అంకితమిచ్చారు. ఆయన ఆశయం కోసం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని,రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. వీరితోపాటు ఈ సభలో వాళ్ళ కుటుంబ సభ్యులు ప్రియాంక విజయలక్ష్మి సోదరుడు సాయి వరప్రసాద్ అమరజీవి అజయ్రాజారావు,అజయ్రమేష్బాబు,ఇంకా జిల్లా రాష్ట్ర మండల నాయకులు పాల్గొని విజయలక్ష్మి మృతికి నివాళులులు అర్పించారు. విజయలక్ష్మి చిత్ర పటానికి పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దుల బసవరావు, కాకి రాజశేఖర్, చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, యద్దనపూడి మధు, తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలికళాకారులు అమరవీరులని స్మరించుకుంటూ విప్లవ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి బంధువులు స్నేహితులు పార్టీ కార్యకర్తలు మండలనాయకులుగ్రామస్తులు పాల్గొని జయప్రదం చేసినందుకు కమిటీ తరపున పార్టీ మండల కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది.

# నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, మచ్చ రమేష్**



**కరీంనగర్, జూన్ 9 (నిఘా న్యూస్):** దేశ వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, మే 5న పరీక్షను నిర్వహించడం జరిగింది.దాదాపు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం. ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం మరల వారి, పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుంది. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచేతవిచారణ జరిపించాలని రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ డిమాండ్ చేశారు.

# జలమండలిలో ప్రైవేట్ దందా

- సొంతగా పనులు చేపడుతూ డబ్బులు దండుకుంటున్న జనరల్ పర్సన్ సిబ్బంది
- పట్టించుకోని జలమండలి ఉన్నతాధికారులు



హైదరాబాద్, జూన్ 9 (నిఘా న్యూస్): జలమండలి మురుగు(డ్రైనేజీ) విభాగంలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న జనరల్ పర్సన్(జీపీ) సిబ్బంది బోర్డు నిబంధ నలకు విరుద్ధంగా ప్రైవేట్ దందాను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విభాగంలో పనిచేస్తున్న జీపీ సిబ్బంది డ్రైనేజీ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలలో చౌకేజీలు ఏర్పడి మురుగు ఉప్పొంగినప్పుడు వాటికి మరమ్మతుల చేపట్టాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా జీపీలు ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే గ్రేటర్ హైదరాబాద్ లోని జల మండలి సెక్షన్ల పరిధిలోని డ్రైనేజీ విభాగంలో పనిచేస్తున్న కొంత మంది జీపీలు తమ స్థానంలో వేరొక్కరిని పెట్టుకుని తాము చేయాల్సిన పనిని వారితో చేయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రోజువారి కూలీలకు జీపీలు డబ్బులు ఇచ్చి వారితో పనులు చేయిస్తూ ఏరియాలో ప్రైవేట్ దందాకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఏరియాలోని అపార్ట్మెంట్లు, షాపింగ్ మాల్స్, హొటళ్లు, ఫంక్షన్ హాల్స్, సినిమా థియేటర్స్, ప్రైవేట్ హాస్పిటల్స్ యజమాన్యాల నుండి జిపిలు ప్రతినెల పెద్ద ఎత్తున డబ్బులు దండుకొని వాటికి సంబంధించిన మురుగు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను పట్టించుకోని జీపీలు బయట ప్రైవేట్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఇండ్లు, భవనాలకు, సంబంధించి కొత్త డ్రైనేజీ పైపులైన్ల ఏర్పాటు , మ్యాన్ హొళ్ల నిర్మాణం తదితర పనులను జీపీలు ప్రైవేట్ గా చేపడుతూ భారీగా డబ్బులు దండుకుంటున్నట్లు విమర్శలున్నాయి. జీపీలు తమ పనులను పక్కకు బెట్టి ప్రైవేట్ గా పనులు చేపడుతున్న పై అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొంతమంది డీజీఎంలు,మేనేజర్ల అండదండలతోనే జీపీలు ఏరియాలో ప్రైవేట్ పనులను దర్జాగా చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు వారు పేర్కొంటున్నారు. ప్రైవేట్ గా పనులు చేయడం ద్వారా ఏరియాలోని అపార్ట్మెంట్లు, హొటళ్లు, షాపింగ్ మాల్స్, ప్రైవేట్ హాస్పిటల్స్ , సినిమా థియేటర్ల యాజమాన్యాల నుంచి జీపీలకు ప్రతినెల వేలాది రూపాయలు అందుతున్నాయని వారంటున్నారు. ఈ క్రమంలోనే సామాన్యుడు తమ బస్తీలో మురుగు సమస్య తీవ్రంగా ఉందని ఫిర్యాదు చేస్తే పట్టించుకొని జీపీలు, ప్రైవేట్ యాజమాన్యాల నుంచి ఫోన్ వస్తే చాలు అక్కడిక వాలిపోతూ పనులను పూర్తి చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కొంతమంది జీపీలు తమకు తాము వర్క్ ఇన్స్పెక్టర్లుగా చెప్పుకుంటూ ఏరియాలో హవా చలాయిస్తున్నట్లు వారు ఆరోపించారు. ఏళ్ల తరబడి ఒకే సెక్షన్ లో విధులు నిర్వహిస్తున్న జీపీలు ఏరియాలో పట్టు సాధించి, ఆడింది ఆటగా పాడిందే పాటగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని సామాజిక కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలుగు భాషను తీర్చిదిద్దిన రామోజీ



**అక్షర యోధుడికి నివాళులర్పించిన ప్రెస్ క్లబ్**

**పెబ్బేరు, జూన్ 9 (నిఘా న్యూస్):** తెలుగునాట ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలకు సంబంధించిన ఈనాడు, ఈటీవీతో పాటు అనేక వాణిజ్య సంస్థలను సృష్టించి, కొత్త పుంతలు తొక్కించిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల పెబ్బేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గొడుగు బాలవర్ధన్ పాలకవర్గం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఎంతో మంది అక్షర సైనికులను తయారు చేసిన ఘనత ఆయనదని, విశ్వసనీయతకు మారుపేరు అని అన్నారు.ముందుగా ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య పరిరక్షణకు,సమాజ చైతన్యనికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. తదనంతరం కమిటీ సభ్యులు మాట్లాడారు. మీడియాలో కొత్త ఒరవడి సృష్టించి సాహితీ రంగానికి ఎనలేని సేవ చేసిన రామోజీరావు మరణం విచారకరమన్నారు.తెలుగు భాషకు రామోజీరావు అమోఘమైన సేవ చేశారని చెప్పారు. వాడుక భాషను వినియోగంలోకి తీసుకురావడంలో కీలక భూమి పోషించడం ద్వారా ఆ పత్రికలను పాఠకులకు చేరువచేసి పెద్ద సంఖ్యలో పాఠకులను తయారు చేసిన ఘనత రామోజీరావు దేనన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, గౌరవ సలహాదారులు బి.రమేష్ శెట్టి,శ్రీనివాసులు, రవీందర్ గౌడ్, బాలరాజు, రాజేందర్ శెట్టి, విజయ్ కుమార్,ప్రచార కార్యదర్శి అతీక్ పాషా, ఉమాశంకర్, నందీశ్వర్, తరుణ్, చింతకాయల రమేష్,మోహన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాది సిహెచ్ సిద్ధిరాములు తండ్రి మైసయ్య మృతి దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటరెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బొల్లెపల్లి కుమార్ ముద్దసాని చంద్రశేఖర్ రెడ్డి దుర్గేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

*-వలిగొండ, జూన్ 9 (నిఘా న్యూస్):*

## అడ్డగూడూరులో బిజెపి సంబరాలు



**అడ్డగూడూరు, జూన్ 9 (నిఘా న్యూస్):** మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా అడ్డగూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిజెపి మండల అధ్యక్షులు ననుబోతు సైదులు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో రికార్డు స్థాయిలో మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టడం దేశానికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వర రావు ,మండల ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షులు ఇమ్మానియేల్, ఉపాధ్యక్షులు మద్ది నరేందర్, ఓబీసీ అధ్యక్షులు మరాఠా కుమారస్వామి, మహిళా నాయకురాలు కూరాకుల అరుణ ఆసర్ల మంజుల కొత్తోజు నవీన్ పోగుల యాదగిరి నరసింహ నిమ్మల రమేష్, దేశ బోయిన నాగరాజు యాదగిరి, ఏనుగు బాలు, కృష్ణారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులుగా సంతన్న



**లోకేశ్వరం, జూన్ 9 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ గల పొలం మండల కమిటీ ఎన్నిక స్థానిక శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణా గౌడ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా సంతన్న ప్రధాన కార్యదర్శిగా ఎం.ఆంజనేయులు గౌరవాధ్యక్షులుగా సుదర్శన్ రెడ్డి సలహాదారులుగా ఎం.శ్రీధర్ చిన్న రావు, ఉపాధ్యక్షులుగా మహేందర్ తండసాగర్ కోశాధికారిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా నాయకులు చాకేటి లస్మన్న, తెలంగాణ ఉద్యమ చరిత్ర పుస్తక రచన బాధ్యతలు జాదవ్ పుండ్లిక్ రావు, జనార్ధన్ రెడ్డి, గాంగుల చిన్నాన్న, ఉద్యమకారులు ఎం శ్రీధర్, చిన్న రావు, ఆంజనేయులు, నాగరావు,భోజరం తదితరులు పాల్గొన్నారు.

## కనకాపూర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**లోకేశ్వరం, జూన్ 9 (నిఘా న్యూస్):** పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికను నిర్వహించి పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. లోకేశ్వరం మండల కనకాపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కనకాపూర్,అబ్దుల్లాపూర్ 2006 - 2007 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరిని ఒకరు కలుసుకొని కుటుంబాల పరిస్థితిలను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలు విద్యను అభ్యసించిన రోజులలో గత స్మృతులను నెమరు వేసుకున్నారూ. పాఠశాల స్థాయి విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైనవని ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. ఈ పూర్వ విద్యార్థులు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులతో ఎవరైనా సతమతమవుతున్న అందరూ కలిసికట్టుగా వారికి ఆర్థిక సాయం అందిస్తామని అలానే పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం తమ గురువులైన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మ ప్రేమ ఫౌండేషన్ కు.. స్కూల్ బ్యాగుల అందజేత



**బాలాపూర్, జూన్ 9 (నిఘా న్యూస్):** శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి, స్త్రీ హస్తిన మహిళా మండలి సంయుక్తాధ్వర్యంలో బోడుప్పల్ లోని అమ్మ ప్రేమ ఫౌండేషన్ కు స్కూల్ బ్యాగులను అందజేసినట్లుగా వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎల్లం పూర్ణశాంతి గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని, కెనడాలో నివసిస్తున్న ఆమె తనయుడు సాయి తేజ మణి కంటేశ్వర్ సహాయం మేరకు ఆశ్రమం లోని విద్యార్థులకు కావలసిన వస్తువులు అందజేసినట్లుగా తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఆశ్రమానికి మంచి పేరు తేవాలని సూచించారు.

# రహదారుల నిర్మాణంతోనే ప్రాంతాల అభివృద్ధి




## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్, జూన్ 9 (నిఘా న్యూస్): గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం మెరుగ్గా ఉండాలని అప్పుడే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. పట్టణంలో ఓల్డ్ హైవే రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఆదివారం బీటీ రోడ్డు తారు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజ చేశారు. అనంతరం కాంట్రాక్టర్ వెంకట్ రెడ్డి, డిఈ రవీందర్, ఏఈ రాజశేఖర్ తదితరులను అభినందిస్తూ సీట్లు తినిపించారు. రోడ్డు నిర్మాణం పనులు అత్యంత నాణ్యతగా వేయాలని ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా షాద్ నగర్ చౌరస్తా నుండి 4.9 కిలోమీటర్ల మేర అన్నారం జంక్షన్ వరకు నిర్మిస్తున్న ఈ రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం 45 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఇందులో కొత్తూరు ప్రాంతంలో ఒక అర కిలోమీటర్ వరకు నిధులు కేటాయించబడ్డాయని ఈ సందర్భంగా వివరించారు. వీలైనంత త్వరగా రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, జడ్పిటిసి వెంకటరామిరెడ్డి,బాలరాజ్ గౌడ్, తిరుపతి రెడ్డి, కృష్ణవేణి, జమృత్ ఖాన్, రాజేందర్ రెడ్డి, రాయికల్ శ్రీనివాస్, యాదగిరి యాదవ్, కౌన్సిలర్ సర్వర్ పాషా, సోలిపూర్ శ్రీశైలం, విజయ్ కుమార్, అప్పి, నల్లమోని శ్రీధర్, కొప్పునూరు ప్రవీణ్, నరేష్, లింగారెడ్డి గూడా అశోక్, సురేష్, అజ్మత్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై విచారణ జరపాలి

## ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్



మేడిపల్లి, జూన్ 9 (నిఘా న్యూస్): దేశ వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, మే 5న పరీక్షను నిర్వహించడం జరిగింది. దాదాపు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం మరల వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుంది. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచేతవిచారణ జరిపించాలని ఎండి అన్వర్ డిమాండ్ చేశారు.

# సదాశివపేటలో జీనియస్ స్కూల్ ప్రారంభం



## విద్యలో అగ్రగామిగా సదాశివపేట కావాలి

## మున్సిపల్ చైర్మన్ అపర్ణ పాటిల్

సంగారెడ్డి, జూన్ 9 (నిఘా న్యూస్): మానవ జీవనానికి విద్య ఎంత అవసరమో సభ్య సమాజంలో సంస్కార వంతులను కూడా అంతే బాధ్యతతో తయారు చేయాలని సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అపర్ణ పాటిల్ అన్నారు. ఆదివారం జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సంధర్బంగా అమే మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ధీటుగా విధ్యాను అందించుటకు ముందుకు వచ్చిన జీనియస్ పాఠశాల యాజమాన్యం అభినందించారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులకు ఐఐటి జే నిట్ ఫౌండేషన్ కోర్సు చదివించడం మంచి నిర్ణయం అన్నారు.జీనియస్ పాఠశాలలో అత్యంత అనుభవైన క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయులచే బోధించడం ద్వారా మంచి ర్యాంకు సాధించే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం తరుపున తమ తరుపున ఎలాంటి సహాయ సహకారాలు కావాల్సిన అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాల్లో జీనియస్ పాఠశాల మంచి ర్యాంకులు సాధించి పట్టణంకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టన మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ బిజెపి నాయకులు రాజేశ్వర్ రావ్ దేశ్పాండే కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిమామిడి రాజు కౌన్సిలర్ వోదెల మాణిక్ రావ్ పాఠశాల యాజమాన్యం పోల శ్రీనివాస్ పోల వెంకటేశం శ్రీనివాస్ ప్రిన్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో 128 కోట్లతో డ్రైనేజీ పనులు

- అభివృద్ధిని భారంగా భావించే వారిని వదులు కుందాం
- మున్సిపాలిటీ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



మధిర, జూన్ 9 (నిఘా న్యూస్): మధిర మున్సిపాలిటీని అభివృద్ధిలో మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, స్థానిక నేతలు సమిష్టిగా కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మధిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులు, పాలకవర్గం, అఖిలపక్ష నేతలతో కలిసి మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ప్రస్తుతం ఉన్న సమస్యలపై డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు మధిర అభివృద్ధిని చూసేందుకు వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నేతలు కలిసి కృషి చేయాలని కోరారు. మధిర పట్టణానికి ఉజ్వల భవిష్యత్తు ఉంది.అది మనందరి బాధ్యత అభివృద్ధిని భారంగా భావించే వారిని వదిలించుకునేందుకు సిద్ధంగా ఉండాలని సున్నితంగా హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఒక్కరోజు కూడా వృధా కాకూడదనే ఉద్దేశంతో మధిర పట్టణ అభివృద్ధి లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పాలన అభివృద్ధి రెండిటిని గాటిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది,మధిరకు పెద్ద ఎత్తున నిధులు వస్తాయి అన్న ఆశతో ప్రజలు ఉన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గాను రూ.128 కోట్లు కేటాయిస్తూ ఇప్పటికే జీవో విడుదలైన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, శానిటేషన్, తాగునీరు, విద్యుత్తు ఇలా ఏ విషంలోనైనా మధిర పట్టణంలో ఇబ్బంది ఉండదు అన్న భరోసా కల్పించాలి అన్నారు. అధికారుల పని తీరుపై ప్రతినెల సమీక్ష చేస్తాం. నిర్లక్ష్యంగా ఉంటే వదిలించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపాలిటీలో వాహనాలకు జిపియస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు బయో మెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ముందుగా సమావేశంలో మున్సిపల్ చైర్మన్, మొండితోక లత కౌన్సిలర్లు, వివిధ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మధిర పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు.



పెబ్బేరు పట్టణ కేంద్రంలోని వల్లపురెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగిన శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి కుమార్తెల పుట్టు చీర కార్యక్రమానికి ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,బి.రాంచంద్రారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్,జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్,మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్,మండల నాయకులు దయాకర్ రెడ్డి,కౌన్సిలర్ అశ్విని సత్య నారాయణ,పెద్ద మందడి ఎంపీపీ రఘు,జైపాల్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య,శ్రీరంగాపూర్ నాయకులు శ్రీహరి,యాపర్ల రాంరెడ్డి,ఎల్లారెడ్డి,సునీల్ కుమార్, వినయ్, తాటికొండ కృష్ణ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

–పెబ్బేరు, జూన్ 9 (నిఘా న్యూస్):

# ప్రతి సోమవారం ప్రజావాణి పునః ప్రారంభం

## పిఎంసి కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి



మేడిపల్లి, జూన్ 9 (నిఘా న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం శ్రీకారం చుట్టిన ప్రజావాణి కార్యక్రమం ప్రజాభవన్ లో విజయవంతంగా కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ప్రజావాణిని అందుబాటులో తీసుకొచ్చేందుకు అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పునః ప్రారంభం జరుగుతున్న నేపథ్యంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి మంత్రివర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో తమ అర్జీలను అందజేయాలని ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించు కోవాలని తుంగతుర్తి రవి విజ్ఞప్తి చేశారు.

# వలిగొండలో బిజెపి సంబరాలు



వలిగొండ, జూన్ 9 (నిఘా న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు బోల్ల సుదర్శన్ ఆధ్వర్యంలో ఈరోజు భారత దేశ ప్రధానిగా ఎన్డీఏ అభ్యర్థి నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా దగ్గర బాణసంచా కాల్చి, విజయోత్సవ సంబరాలను నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ,మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

# బండి, కిషన్ రెడ్డికి.. వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షుడి సన్మానం





వరంగల్, జూన్ 9 (నిఘా న్యూస్): భారతీయ జనతా పార్టీ మూడోసారి ప్రభుత్వాన్ని నిర్మిస్తున్న సందర్భంగా తెలంగాణకి చెందిన ఇద్దరు పార్లమెంట్ సభ్యులు కేంద్ర కేబినెట్ లో చోటు దక్కిన సందర్భంగా ఢిల్లీలో రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ని ఆదివారం ఢిల్లీలో బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిసి వారికి బొకే అందించిశాలువాతోసత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం ఇద్దరి ఎంపీలకు చోటు ఇచ్చిన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

# నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



గోల్నాక, జూన్ 9 (నిఘా న్యూస్): ఎన్డీయే కూటమి హ్యాట్రిక్ ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బిజెపి సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గోల్నాక డివిజన్ జస్వాల్ గార్డెన్లో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అనిల్ చారి, రామస్వామి, లక్ష్మీకాంత్ గౌడ్, దిలీప్ శర్మ, రమేష్ గౌడ్, దేవేందర్, వెంకటరమణ, తిరుపతి, విజయ్, విష్ణువర్ధన్లు పాల్గొని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కాలనీవాసులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ గత పది ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. హ్యాట్రిక్ ప్రధానిగా మూడోవసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ మరింత వికసిత్ భారత్ గా దేశాన్ని తీర్చిదిద్దుతారన్నారు. కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

# మండలం కాంగ్రెస్ అధ్యక్షుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



పెబ్బేరు, జూన్ 9 (నిఘా న్యూస్): పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డిని ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించారు. గత మూడు రోజుల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకొని ఆయన స్వగృహానికి వచ్చారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరమర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.రాంచంద్రారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, గంధం రంజిత్ కుమార్,సత్యశీలారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో బిజెపి శ్రేణులు సంబరాలు



మధిర, జూన్ 9 (నిఘా న్యూస్): బిజెపి కేంద్రంలో తిరుగులేని విజయం సాధించి ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా మండల పరిధి నిదానపురం గ్రామంలో భాజపా శ్రేణులు టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయ అలింగనం చేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు బీజేపీకి నీరాజనం పట్టారని,మోదీ కా పరివార్,ఉపాధిహామీ పథకాలు ప్రజల్లో విస్తృతంగా వెళ్లాయని,గడపగడపకు శ్రీరా ముని అక్షింతలు వెళ్లాయని, ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గట్టి పోటీ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మధిర పట్టణ,మండల అధ్యక్షులు గుండా చంద్రశేఖర్ రెడ్డి,పాపట్ల రమేష్,రాము అమరవాది రవీందర్ రెడ్డి, ఏలూరి విజయలక్ష్మి,చల్లా శైలజ,గుండా శ్రీలక్ష్మి,అమరవాది రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

## దర్గాలో ప్రత్యేక ప్రార్థనలతో మొక్కు చెల్లింపు





పలమనేరు, జూన్ 9 (నిఘా న్యూస్): పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని దండపల్లి రోడ్డులో గల హజరత్ గంజే షాహీద్ షా వలి బాబా దర్గాలో జరిగిన 76వ ఉరుసు మహోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే అమర్ కు ఘన స్వాగతం పలికారు,ఈ సందర్బంగా దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు. ఆ భగవంతుని దయతో అందరు కలసిమెలసి సుఖ సంతోషాలతో రానించాలని ఆయన కోరుకున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలమనేరు, గంగవరం మండల నాయకులు పాల్గొన్నారు.

# పులివర్తి నానికి నోబెల్ టీచర్స్ శుభాకాంక్షలు

## విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలని విజ్ఞప్తి



తిరుపతి, జూన్ 9 (నిఘా న్యూస్): చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నానిని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎం రెడ్డి రమేష్ బాబు టి సురేష్ కుమార్ వి జయ ప్రకాష్ నాయుడు భాస్కర్ నాయుడులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి దృశ్యాలు వాలు కప్పి, పుష్పగుచ్చానందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ వారు రాబోయే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఆయన నేతృత్వంలో విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి పూర్వవైభవాన్ని కల్పించాలని అలాగే గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 117 ను రద్దుచేసి అలాగే తొందరగా డీఎస్సీని నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని ఎమ్మెల్యేకి విన్నవించారు . ఇందుకు ఎమ్మెల్యే నాని సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు పోయి వివరంగా తెలియజేస్తానని అన్నారని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వారు తెలిపారు.

## కార్యకర్తలే నా కుటుంబ సభ్యులు

### ఇచ్చిన మాటకి కట్టుబడి ఉంటా

### చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



**చంద్రగిరి, జూన్ 9 (నిఘా న్యూస్):** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే నా కుటుంబ సభ్యులని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం శ్రీనివాసమంగా పురంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం ఎమ్మెల్యే హోదాలో మొదటి సారి చంద్రగిరిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి ప్రమాదంలో అశువులు బారిన సీనియర్ నాయకుడు టీడీపీ నేతలు గంగపల్లి భాస్కర్, దర్శకుడు భాను ప్రకాష్ రెడ్డి (బన్నీ) చిత్రపటాలకు నివాళులర్పించారు. వారు చేసిన కృషిని స్మరించుకున్నారు. అనంతరం గంటకు పైగా కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యకర్తల కృషి ఫలితంగానే రికార్డు మెజార్టీ సాధ్యమైందని స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని, ఆరోగ్యం కుదుట పడగానే నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తానని పేర్కొన్నారు.

## నిత్య కృషీవలుడు రామోజీరావు

### ఆయన మృతి బాధాకరం

### సంతాపాన్ని తెలియజేసిన అమరనాథ రెడ్డి




**పలమనేరు, జూన్ 9 (నిఘా న్యూస్):** పత్రికా రంగంలో ఎనలేని కృషి చేసి తెలుగు పత్రికా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న నిత్య కృషివలుడు ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి అన్నారు. రామోజీరావు మరణ వార్త తెలుసుకున్న ఆయన శనివారం ఓ ప్రకటనలో తన సంతాపాన్ని తెలియజేశారు. రామోజీరావు మృతి చాలా బాధకరమని ఎందరికో మార్గదర్శకులు శ్రమే తన ఆయుధంగా మలుచుకొని ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎంతో ఎత్తుకు ఎదిగి ఎన్నో రంగాలల్లో ఆయన తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఎందరికో మార్గదర్శకులైన రామోజీ రావు మనమధ్య లేరు అన్న వాస్తవం ఆయన అభిమానులకు కఠినమైన దైనా భరించక తప్పదని ఆవేదన వ్యక్తపరిచారు. ఆయన మృతికి సోకతప్త హృదయంతో నివాళులు అర్పిస్తూ వారి కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

## మోడీని అభినందించిన కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 9 (నిఘా న్యూస్):** దేశ ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోదీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు. ట్విట్టర్ వేదికగా "వరుసగా 3వసారి భారత ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నరేంద్రమోదీకి అభినందనలు. మీకు, ఎన్డీయే ప్రభుత్వంలోని మీ సహచరులకు దేశ ప్రజలకు సేవ చేయడంలో విజయవంతమైన పదవీకాలం ఉండాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు.

## రంగసాయిపేటలో బిజెపి శ్రేణుల సంబరాలు



**వరంగల్, జూన్ 9 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని రంగసాయిపేటలో నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం 42వ డివిజన్ బిజెపి నాయకులు బక్కి రంజిత్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రామోజు మోహనా చారి కర్నె రవీంద్ 41 డివిజన్ అధ్యక్షుడు కర్ని వాసుదేవ్ 39వ డివిజన్ అధ్యక్షుడు బోరిగం నాగరాజు దూడ పరమేష్, డి.అశోక్ కంచె వంశీ, దార బోయిన అనిల్, బోయిన రాజు క్యాతం రంజిత్, ఆవునూరి వంశీ, అనిల్, గోపి, కిరణ్, అజేంద్ర, రాకేష్, బక్కి వరుణ్ కిషన్ బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన బిజెపి సంబరాలు



**కథలాపూర్, జూన్ 9 (నిఘా న్యూస్):** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలో బిజెపి నాయకులు భారత దేశ ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా అలాగే కేంద్ర మంత్రులుగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా నాయకులు బాణాసంచా కాల్చి,స్వీట్స్ పంచుకొని విజయోత్సవ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకన్న,బద్రి సత్యం,తెడ్డు మహేష్,మల్యాల మారుతి,వీరమల్ల శ్రీనివాస్,ప్రవీణ్, గాండ్ల స్వామి,తరి గంగాధర్ బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన ప్రధాని మోడీ

## మెట్టుగూడలో బిజెపి శ్రేణుల సంబరాలు

**సికింద్రాబాద్, జూన్ 9 (నిఘా న్యూస్):** భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ముచ్చటగా మూడవసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, రెండవసారి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మెట్టుగూడా చౌరస్తాలో బిజెపి ఓబీసీ మోర్చా ఎంబీసీ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ మల్లేశ్వరపు ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ భారతదేశంలో సుస్థిర పాలన అందించి దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే కాకుండా అవినీతి రహిత పాలన అందించిన మోడీ 2047 వరకు భారతదేశం అభివృద్ధి చెందిన దేశాంగా తీర్చిడిద్దడమే తన లక్ష్యమని అందుకే భారతదేశ ప్రజలు మొట్టమొదటి దేశ ప్రధాని నెహ్రూ రికార్డును చెరిపి వేసి నరేంద్ర మోడీ నాయకత్వం అని బలపరచారని అన్నారు. గతంలో ఆర్థిక అభివృద్ధిలో 11వ స్థానంలో ఉన్న దేశాన్ని ఐదవ స్థానానికి తీసుకు వచ్చిన ఘనత నరేంద్ర మోడీదేనని రానున్న ఐదేళ్ల కాలంలో మూడో స్థానానికి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు మీడియా ప్రతినిధులు 2024 లో జరిగిన ఎన్నికల్లో మోడీ ప్రభావం తగ్గిందని ప్రచారం చేయడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామని అన్నారు. 2014 నుండి 2024 వరకు మూడుసార్లు జరిగిన పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో 42,52, 99 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ బీజేపీకి 2024లో సొంతంగా 241 సీట్లు వస్తే లెక్కలు తెలియనట్టుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడడం విడ్డురంగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు. శ్రీధర్ గుప్తా నీలం మహేందర్ గండయ్య రాజ్యలక్ష్మి ఉమా తదితరులు పాల్గొన్నారు.



# పీజీ విద్యార్థులకు నిరంతర వైద్య విద్య





**తిరుపతి, జూన్ 9 (నిఘా న్యూస్):** శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో జోనల్ నిరంతర వైద్య విద్య కార్యక్రమం.ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్. పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల కొరకు జోనల్ నిరంతర వైద్య విద్య కార్యక్రమం నేషనల్ మెడికల్ కమిషన్, మరియు రాష్ట్ర వైద్య విద్య సంచాలకుల ఆదేశాల మేరకు ఈజోనల్ వైద్య విద్య కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇందులో కుప్పం నుండి పి ఈ ఎస్. వైద్య కళాశాల, కడప నుండి ఫాతిమా వైద్య కళాశాల, చిత్తూరు నుండి అపోలో వైద్య కళాశాలలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డాక్టర్.పి,ఏ, చంద్రశేఖరన్ మాట్లాడుతూ ప్రసూతి విభాగ పీజీ వైద్య విద్యార్థులు కు ఇలాంటి నిరంతర వైద్య విద్య కార్యక్రమం పాల్గొనడం వలన గర్భం దాల్చినస్త్రీలకు, ప్రసవించే సమయంలో కలుగుతున్న పలు ఇబ్బందులను,గురించితెలుసుకొని వారికి అందించవలసిన మెరుగైన వైద్యం గురించి, ఇందులో చర్చ సమావేశము నిర్వహించారు. అందుకు కావలసిన నైపుణ్యాన్ని పలు వైద్య కళాశాల నుంచి వచ్చిన పీజీ వైద్య విద్యార్థులు, ప్రసూతి విభాగవైద్యులు సూచనలు సందేహాలను నిర్వర్తించుకొని, పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి నిరంతర వైద్య విద్య కార్యక్రమం ఎంతోదోహదపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు, ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ ప్రమీలదేవి, ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ (పరిపాలన) డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణ మూర్తి అకాడమిక్ (పోస్ట్ గ్రాడ్యుయేట్స్) మరియు డాక్టర్ సాయి వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# రామోజీకి తిరుపతి ప్రెస్ క్లబ్ నివాళులు

**తిరుపతి, జూన్ 9 (నిఘా న్యూస్):** సాధారణస్థితి నుంచి అసాధారణ స్థాయికి ఎదిగిన ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు పత్రిక, మీడియా రంగాలకే ఓ పాఠంగా చరిత్రలో నిలిచిపోతారని ప్రెస్ క్లబ్ సీనియర్ పాత్రికేయులు కొనియాడారు.తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి జర్నలిస్టులు పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ రామోజీరావు మృతి అక్షర సమాజానికి తీరని లోటుగా అభివర్ణించారు. గత ఐదు దశాబ్దాలుగా ఈనాడు పత్రికలో పనిచేసిన రచయితలకు ఆనాటి ఈనాడు ఓ పాఠశాలగా నిలిచిందని గుర్తు చేశారు. పత్రికారంగానికి వయసు అడ్డు రాదని వయోవృద్ధుడైనా కూడా చివరి రోజుల్లో రామోజీ ఎడిషన్ నందు వార్తలకు ప్రాముఖ్యత రావడం కోసం రామోజీ మేధస్సులోని అమృత అక్షరాలను ఉపయోగించే వారని. మొన్నటి వరకు అలుపెరగని రామోజీలోని మేధాశక్తిని గుర్తు చేశారు. రామోజీని పచ్చళ్ళు అమ్ముకునే వ్యక్తి అని విమర్శించిన వారికి పత్రికా మీడియా ద్వారా ప్రభుత్వాలను మార్చే స్థాయి రామోజీకి ఉందని జరుగుతున్న పరిణామాలే సాక్షాలన్నారు. శ్రద్ధాంజలి సభ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యదర్శి బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్ లు ముందుండి నిర్వహించగా ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు, ఏపీ పత్రికా సంపాదకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా లక్ష్మీపతి, ఏపీ ఫోటోగ్రాఫర్ల సంఘం నాయకులు గిరిబాబు, సీనియర్ పాత్రికేయులు, రచయితలు,ప్రింట్ మీడియా మిత్రులు, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో,వీడియో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని రామోజీరావుకు శ్రద్ధాంజలి ఘటించారు.



# మీ చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకం ప్రతి ఇంట్లో ఉండాలి

## నిమ్స్ మాజీ డైరెక్టర్ డా.రాజా రెడ్డి

**హైదరాబాద్, జూన్ 9 (నిఘా న్యూస్):** చేత(తు)ల్లో ఆరోగ్యం అనే పుస్తకం ఎంతో విలువైన సమాచారంతో సమాజంలో ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా ఉందని నిజాం ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్స్ మాజీ డైరెక్టర్ డా రాజా రెడ్డి అన్నారు. అదివారం నగరంలోని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన ముఖ్య అతిదిగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవిత కాలం పెరుగుతున్న క్రమంలో, ఎదురవుతున్న అనేక దీర్ఘ కాలిక జబ్బుల గురించిన అవగాహన ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, సామాన్యులకు అర్థం అయ్యే సరళమైన తెలుగు భాషలో ఇలాంటి పుస్తకాలు లేవు. ఈ పుస్తకం ప్రతి ఒక్కరు తమ ఇంట్లో ఉంచుకోవాలని కోరారు. మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డా. రమణి మాట్లాడుతూ ఈ పుస్తకం ఇంట్లో ఈ పుస్తకం ఉంటే డాక్టర్ ఉన్నట్టేనని ప్రతి ఒక్కరూ చదవవలసిన పుస్తకం చదవాలని పేర్కొన్నారు. తెలంగాణ ఆయుష్ మాజీ అదనపు సంచాలకులు డా.విజయ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం గురించి ఉండే అనేక సందేహాలకు, వైద్యులు అందించవలసిన సలహాలు ఇందులో ఉన్నాయని అన్నారు. పుస్తక రచయిత డా ప్రతిబా లక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవడం, మరియు మన ఆరోగ్యం బాధ్యత మనమే తీసుకోవడం వలన మన చేతల్లోనే (మన చేతుల్లోనే) మన ఆరోగ్యం ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ గాంధీ, ఉస్మానియా హాస్పిటల్ కు చెందిన డాక్టర్లు, దాదాపు వంద మంది అరోగ్యాభిలాషులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలల్లో..
# పుస్తకాల వ్యాపారం

- పుస్తకాల ధరలను 100శాతం పెంచి అమ్ముతున్న వైనం
- ఈ ఏడాది కూడా భారీగా ఫీజుల పెంపుదల
- పుస్తకాలు, యూనిఫాం స్కూల్ లోనే కొనాలి
- తల్లిదండ్రుల దోపిడీయే పాఠశాలల విధానం
- చోద్యం చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం




**అంబర్‌పేట్, జూన్ 9(నిఘా న్యూస్):** నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని అంబర్ పేట మండలంలోని ప్రైవేట్, కార్పొరేట్, ప్లే స్కూల్‌లలో యాజమాన్యాలు విద్యా వ్యాపారానికి శ్రీకారం చుట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగా ఈ విద్యా సంవత్సరం సైతం యాజమాన్యాలు భారీగా ఫీజులు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయి. పాత కొత్త అనే తేడా లేకుండా ప్లే స్కూల్‌ల నుంచి మొదలుకొని కార్పొరేట్ పాఠశాలల వరకు ఫీజులను భారీగా ఇంచి వేశాయి. డొనేషన్లు, అభివృద్ధి చార్జీలు, ఫీజులతో పాటు పుస్తకాలు, స్కూల్ యూనిఫాంల పేరిట యాజమాన్యాలు తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నాయనే విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే తమ పాఠశాలలకు ఉన్న డిమాండ్ ను బట్టి ఆయా యజమాన్యాలు ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం ఇక్కడి ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఏకంగా 25 శాతానికి ఫీజులను పెంచి వేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి విద్యా సంవత్సరం ఫీజులను ఇష్టానుసారం పెంచడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుందని వారు వాపోతున్నారు. కోవిడ్ సమయంలోనూ అంబర్ పేట మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ వద్ద ఫీజులను ముక్కు పిండి వసూలు చేసినట్లు తల్లిదండ్రులు గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో డిమాండ్ ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు మెరిట్ ఉన్న విద్యార్థులకు సీట్లు ఇస్తామని పైపైకి చెబుతున్న డొనేషన్లు ఫీజుల పేరిట భారీగా వసూలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. అదేవిధంగా యూనిఫాంలు, పుస్తకాలను తమ వద్దనే కొనాలని నిబంధనలు యాజమాన్యాలు విధించాయని, ఈ క్రమంలోనే యూనిఫామ్ లు, పుస్తకాల ధరలను అమాంతం పెంచి వేశాయని వారు అంటున్నారు. మూడు జతల యూనిఫాంకు వెయ్యి రూపాయల చొప్పున మూడు వేలు వసూలు చేస్తున్నారని, బహిరంగ మార్కెట్లో రూ.200లకు లభించే బూట్లకు ఇక్కడ రూ. 500 వసూలు చేస్తున్నారని, బెల్టుకు రూ 300, టైకి రూ.300, ఐడి కార్డుకు వంద రూపాయలు యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వీటిని బయట కొనుక్కుంటామని తాము చెబితే యాజమాన్యాలు తమ వద్దనే కొనాలని, లేకపోతే అడ్మిషన్ ఉండదని బెదిరింపులకు పాల్పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాల ధరలు సైతం విపరీతంగా పెంచి వేశారని, ఆరవ తరగతి విద్యార్థికి పుస్తకాలు ఇవ్వడానికి రూ.8 వేలు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రతి విద్యా సంస్థను ఫీజుల మోత కారణంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అప్పులు చేసి మరి డొనేషన్లు, ఫీజులు చెల్లించాల్సి వస్తుందని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. గత మూడేళ్లలో మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు 50 శాతం వరకు ఫీజులను పెంచి తమ నడ్డి విరిచాయని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తప్పని సరి పరిస్థితుల్లో అప్పు చేసి మరి తాము ఫీజులు చెల్లించాల్సి వస్తుందని వారు అంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మండల పరిధిలో స్కూల్ ఫీజుల పెంపుపై నియంత్రణ విధించి తమను ఆదుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మధిరలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య.

## బై నంబర్లతో పార్క్ స్థలం రిజిస్ట్రేషన్

**కబ్జాలకు సహకరించిన అధికారులు**
**ఫెన్సింగ్ వేయకుండా అడ్డుకున్న కాలనీవాసులు**



**బాలాపూర్, జూన్9 (నిఘా న్యూస్):** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ నందిహిల్స్ కాలనీ రోడ్ నంబర్ 8లో పార్క్ స్థలం 600 గజాలు కబ్జా చేసి, ఆ స్థలాన్ని బై నెంబర్ వేసి భూ కబ్జాదారుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపిస్తూ రంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ కన్వీనర్, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకుడు సామ భాస్కర్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. సర్వే నంబర్ లో 24, 25 ఉన్న ఆరు వందల గజాల పార్క్ స్థలాన్ని మూడు వందల గజాలు 604/1 మూడు వందల గజాలు 604/2గా డివైడ్ చేసి ఆక్రమణ దారుడు రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ చేయించుకొన్నాడని ఆరోపించారు. జూన్ 4న కొంతమంది గుండాలు వచ్చి చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నం చేయగా కాలనీ వాసులు వెంటనే స్పందించి అడ్డుకొన్నారని తెలిపారు. ఈ ఆక్రమణదారునిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ లకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. పార్కు స్థలాన్ని కాపాడాలని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని, అధికారులు స్వాధీనం చేసుకొకుంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా అని తెలిపారు.

## స్కూల్ అసిస్టెంట్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక


**రాష్ట్ర అధ్యక్షుడుగా చింతల సుబ్బారావు**
**ప్రధాన కార్యదర్శిగా పూతలపట్టు నరోత్తమ రెడ్డి**



**తిరుపతి, జూన్ 9 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లాలో స్కూలు అసిస్టంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం తిరుపతి టిపిపిఎం పాఠశాల యందు నిర్వహించారు.ఈ సమావేశంలో నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతూ ఎన్నిక అయిన ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆకాంక్షలు తప్పక నెరవేర్చాలని, సిపియస్ రద్దు, జడ్.పి.పి.ఎస్, ఏపీగ్లిక్ లోన్స్,కరువు భత్యం బకాయిలు, ఐ.ఆర్, 117 జిఓ రద్దు,సమాంతర తెలుగు మాధ్యమం, 3,4,5 తరగతుల విలీన ఉపసంహరణ, ౦1, ౦2 లలో పదొన్నతులు, అన్ని రకాల ఖాళీల పదోన్నతులు, సర్వీస్ తో బదిలీలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏన్నుకోవడ మైనది. గౌరవ అధ్యక్షుడుగా శ్రీశరత్ బాబు (ప్రకాశం), రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా చింతల సుబ్బారావు (బ్యాపట్ల), రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా పూతలపట్టు నరోత్తమ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి.శివసంకరయ్య (అనంతపురం), డి.వేణుగోపాల్ రెడ్డి(చిత్తూరు), సి.హెచ్ శివశంకర్ (నెల్లూరు)కె.డేవిడ్ పాల్(బ్యాపట్ల), రాష్ట్ర కార్యదర్శులుగా సి.జడ్.యల్ జయనంద (చిత్తూర్), బి.రాజశేఖర్ (అనంతపురం), జి.నాగన్న (సత్య సాయి), జి.శ్రీహరి నాథ్(బాపట్ల), జి.నాగరాజ రెడ్డి (అన్నమయ్య), సహ అధ్యక్షులుగా జి.గోవింద నాయుడు (విజయ నగరం),కార్య నిర్వాహక అధ్యక్షులుగా జి.శౌరి రాయులు (గుంటూరు), కార్య నిర్వాహక కార్యదర్శిగా బి.మదన్ మోహన్, మహిళ ప్రతినిధిగా బి.సుజాతను ఎన్నుకోవడం జరిగింది.

## గ్రూప్ 1 లో మహాలక్ష్మి ప్రశ్నలు..?

**హైదరాబాద్, జూన్9 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ముగిసింది. ఈ పరీక్షలో వచ్చిన ప్రశ్నల గురించి చర్చ జరుగుతోంది. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకానికి సంబంధించిన ప్రశ్నలు ఇచ్చారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి ఒక ప్రశ్న ఇచ్చారు. అలాగే గృహజ్యోతి పథకానికి సంబంధించిన ఇంకో ప్రశ్న ఇచ్చారు. ఇప్పుడు గ్రూప్-1లో ఈ ప్రశ్నలు రావడం హాట్ టాపిక్ గా మారింది.



## ఘనంగా భీమన్న దేవుని పండగ



**లోకేశ్వరం, జూన్ 9 (నిఘా న్యూస్):** మండలం లోకేశ్వరం మండల కేంద్రంలో ఆదివాసీల ఆరాధ్య దైవం భీమన్న దేవుని పండగను ఆదివాసి నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాజా భజంత్రిలతో మంగళ హారతులతో ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు. ప్రతియేటా వర్షాకాలం ప్రారంభానికి ముందు మృగశిర కార్తె ప్రారంభ మవ్వగానే పంటలకు అనుగుణంగా వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పండగ వేడుకలలో అల్లోళ్ల మురళి, మింటూ,బండారి సాయన్న, నీలగిరి గంగాధర్, గోనేటి జగదీశ్, బండారి శివకుమార్, మెట్టు నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## మేయర్ పీఠంపై కూటమి కన్ను

**విశాఖపట్నం, జూన్ 9 (నిఘా న్యూస్):** సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీఏ కూటమి రాష్ట్రంలోని ఇతర ముఖ్యమైన కార్పొరేషన్లు జిల్లా పరిషత్తులపై దృష్టి సారించింది ముఖ్యంగా కీలకమైన విశాఖపట్నం లాంటి నగరాలపై స్థానిక సంస్థలపై పట్టు సాధించి వైయస్సార్సీపీ క్యాడర్ను నిర్వీర్యం చేయాలని ప్రణాళికలు చేస్తుంది. అందులో భాగంగా మొదటగా మేయర్ పదవి పై కన్నేసిన కూటమి ఇందుకోసం గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ ను కైవసం చేసుకునేందుకు వైఎస్ఆర్సిపి కార్పొరేటర్ల మద్దతు కోసం నేతలు వారితో టచ్ లో ఉన్నట్లు సమాచారం.

## ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

**భర్త బైక్ పై వెళ్తూ వర్షానికి**
**గొడుగు తీయబోయి కింద పడ్డ వైనం**



**తాండూరు, జూన్ 9 (నిఘా న్యూస్):** యాలాల మండల పరిధిలోని అచ్యుతపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సుమిత్ర గ్రూప్ 1 పరీక్ష రాయడానికి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అనంత పద్మ నాభ కళాశాలకు చేరుకుని పరీక్ష రాసిన అనంతరం తన భర్తతో ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి బయలుదేరగా మార్గమధ్యలో వర్షం అధికం కావడంతో బైక్ వెనుక స్థానంలో కూర్చున్న సుమిత్ర చేతి గొడుగును తీస్తుండగా గాలి అధికం కావడంతో, చేతి గొడుగుతో పాటు సుమిత్ర బైక్ నుండి కిందకు పడిపోయారు. తద్వారా తలకు తీవ్ర గాయం అయింది. దీంతో కార్యదర్శి సుమిత్రను తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించగా, డాక్టర్లు కార్యదర్శి సుమిత్ర ఆరోగ్యాన్ని పరిశీలించి, అప్పటికే మరణించారని ప్రకటించారు.

## ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి




**నాగార్జునసాగర్, జూన్ 9 (నిఘా న్యూస్):** నందికొండ మున్సిపాలిటీలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరం ఉద్యమకారుడు రమేష్ జీ మాట్లాడుతూ తెలంగాణలో గత ఎన్నికల్లో భాగంగా తుక్కుగూడ కాంగ్రెస్ సభ లోతెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆరు గ్యారంటీలలో భాగంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఉద్యమకారులకు వెంటనే ఇళ్లస్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో హీరేకా రమేష్ జి, సభావత్ చంద్రమౌళి నాయక్, కవిటి జానకి రెడ్డి, షేక్ చాంద్ బాషా, సిరికొండ మధు, మంగళగిరి ఇ. వెంకోజి, కంచర్ల సుధీర్ కుమార్, పాక శివనాగులు, పందిరి సత్యనారాయణ కందగట్ల వీరయ్య పాల్గొన్నారు.

## సాధువులపై దూసుకెళ్లిన డీసీఎం

**ముగ్గురు మృతి ఇద్దరికీ తీవ్ర గాయాలు**



**పెబ్బేరు, జూన్ 9 (నిఘా న్యూస్):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సాధువులపై ఓ డీసీఎం దూసుకెళ్లడంతో ముగ్గురు సాధువులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన వననపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన 5 మంది సాధువులు విన్ ప్రసూరజ్ మహారాజ్(గురువు), పునీత్ మహారాజ్(50), ప్రియాంకర్ మహారాజ్, వీరికి తోడుగా భగవాన్ భాయ్(36), హేమల్ ప్రవీణ్ షా(52)లు జైన మత ప్రచారం చేస్తూ శనివారం రాత్రి పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద నిద్రించి ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు బయలుదేరి కర్నూలు వైపు వెళ్తుండగా రంగాపురం హైవైపే కర్నూలు వైపు వెళ్తున్న ఓ డీసీఎం అకస్మాత్తుగా సాధువులపైకి దూసుకొచ్చింది. ప్రమాదంలో భగవాన్ భాయ్, హేమల్ ప్రవీణ్? షాలు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మిగతా వ్యక్తులను జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పునీత్ మహారజ్ మృతి చెందారు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ట్రాఫిక్ ను సరి చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు అతివేగంగా, అతి జాగ్రత్తగా వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారకులైన డీసీఎం డ్రైవర్ నరేష్, క్లీనర్ హరీష్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com